క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెం లోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం పూజలు, అభిషేకాలు విశేషంగా జరిగాయి. తెల్లవారు జామున 5 గంటల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. భక్తిశ్రద్ధలతో స్వామికి పూజలు నిర్వహించారు. స్వామి సన్నిధి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరలు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

అప్పన్న సన్నిధిలో అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం



ఎమ్మెల్యే మత్స్యలింగంకి స్వామివారి శేషవస్త్రం అందజేస్తున్న సూపరింటెండెంట్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం దర్శించుకున్నారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అంతరాలయం లోస్వామికి పూజలు చేసి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని సూపరింటెండెంట్ వెంకటరమణ అందజేశారు.

ఎంవీపీ రైతుబజార్ పార్కింగ్ నిర్వహణకు దరఖాస్తులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో 2024–25 సంవత్సరానికి పార్కింగ్ నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మార్కెంటింగ్ శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూలై 1 నుంచి 2025 జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహించడానికి వీలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19 మధ్యాహ్నం ఒంటి గంటలోగా గోపాలపట్నంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. రూ.10 వేలు దరావతు సొమ్ము డీడీ తీసి దరఖాస్తుకు జత చేయాలన్నారు. పూర్తి వివరాల కోసం 9030819082 నంబరును సంప్రదించాలని అధికారులు సూచించారు.

మందుబాబులకు రూ.35,500 జరిమానా

పీఎం పాలెం: మద్యం మత్తులో వాహనాలు నడిపిన 19 మందికి న్యాయమూర్తి జరిమానా విధించారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న 19 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని మంగళవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా ఒక్కొక్కరికీ రూ.1500 నుంచి రూ.3 వేల వరకూ మొత్తం 35,500 జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలకు వినతి

గాజువాక: ప్లే స్కూల్స్ పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా ప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా ప్రైవేట్ పాఠశాలల సంఘం(అప్సా) నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస భాస్కరరావు ఆధ్వర్యంలో నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. నగర పరిధిలోని పలు పాఠశాలల్లో ఎటువంటి అనుమతులు లేకుండా పూర్వ ప్రాథమిక తరగతులతో పాటు ప్రాథమిక తరగతులను కూడా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో కూడా నమోదు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో అప్సా నాయకులు బి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ, ఫణీంద్ర పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్



ట్రోఫీ ఆవిష్కరించిన సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సిన్హా, ఇతర అధికారులు



క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ప్రాజెక్టు హెడ్ సిన్హా

ఎన్టీపీసీ హెడ్ సిన్హా

పరవాడ: క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. దీపాంజలినగర్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఐ ఆర్ ఎస్ ఎం వాలీబాల్, త్రోబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సిన్హా మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. పవర్ పరిశ్రమల నుంచి విచ్చేసిన ఉద్యోగులు, యువతకు పోటీలు నిర్వహించారు. రామగుండం, తెలంగాణ, కుడ్గీ, సదరన్ రీజియన్ హెచ్‌క్యూ, సింహాద్రి స్టేషన్లకు చెందిన టీంలు ఉత్సాహంగా పాల్గొన్నాయి. సంస్థ ప్రాజెక్టు హెడ్ సిన్హా ట్రోఫీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీజీఎం ఆర్.ఆర్ పరిదా, ఓ అండ్ ఎం జీఎం డేవిడ్, ఇతర ప్రముఖులు, జీఎంలు డేవిడ్, వి.టి కాంబ్లే, ఎస్.పద్మప్రియ, హెచ్‌వో హెచ్‌ఆర్ బి.బి. పాత్ర, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

తల్లిదండ్రుల మృతితో అనాథలుగా చిన్నారులు



చిన్నారుల తల్లిదండ్రులు నూకరాజు,కనకమ్మ (ఫైల్)



అనాథలుగా మారిన చిన్నారులు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో తల్లిదండ్రులు ఒకరి తర్వాత మరొకరు మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. ఆలనా పాలనా చూసే వారు లేక ఆ చిన్నారులు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు.గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.గొల్లలపాలెం ఎస్సీ కాలనీలో చందా నూకరాజు(35) కనకమ్మ(30) వారి కుమారులు పవన్ కుమార్,అర్జున్‌లతో కలిసి నివాసం ఉంటున్నారు. నూకరాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త మృతి చెందిన నాటి నుంచి కనకమ్మ తీవ్ర మనోవేదనకు గురై పిల్లల భవిష్యత్,పోషణపై దిగులుతో అనారోగ్యం పాలైంది. దీంతో ఆమె ఈ నెల 1వ తేదీన మృతి చెందింది.దీనితో గ్రామస్తులు తలా ఓ చెయ్యివేసి ఆమె దహన సంస్కారాలు పూర్తి చేశారు. తల్లిదండ్రుల మృతితో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. పెద్దకుమారుడు పవన్‌కుమార్ సబ్బవరం గురుకుల పాఠశాలలో పదోతరగతి చదువుతుండగా.. చిన్న కుమారుడు అర్జున్ నంగినారపాడు జెడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. ఆలనా పాలనా చూసే పెద్దదిక్కు లేకపోవడంతో వారిని దాతలు కానీ,ప్రభుత్వం ఆదుకోవాలని చిన్నారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పరంధామయ్య, విళ్లా రామ్మోహన్‌కుమార్ కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1216వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి పట్టుకొమ్మ వంటి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అలాగే వర్కింగ్ క్యాపిటల్ అందించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలన్నారు. గత ఏడాదిన్నరగా యాజమాన్యం, ప్రభుత్వ చర్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి నుంచి ఉపశమనం పొందడానికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులు, నాయకులు శ్రీనివాసరాజు, సాయి నాగబాబు, వేణుగోపాలరావు, జోషి, మధుసూదనరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

షరతులతోనే మద్దతు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విదసం రాష్ట్ర కన్వీనర్ వెంకటరావు

ఉక్కునగరం: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా మాత్రమే ఎన్డీయేకు టీడీపీ మద్దతు కొనసాగించాలని విదసం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం విదసం రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ, స్టీల్‌ప్లాంట్ రక్షణ, ప్రత్యేక హోదా సాధనే ప్రధాన షరతులుగా ఉండాలన్నారు. ఎన్డీయేకు టీడీపీ మద్దతు లౌకికవాదానికి ముప్పు అయినప్పటికీ బీజేపీ నుంచి ప్రమాదం జరగకుండా ఉండేలా చంద్రబాబు మద్దతు కొనసాగించాలన్నారు. ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు, ఎస్.ఆర్.వేమన, వివిధ జిల్లాల కన్వీనర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మెరుగైన జీవనం



పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో పాల్గొన్న డీఈవో చంద్రకళ తదితరులు

జగదాంబ: పర్యవరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు క్వీన్‌మేరీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో టీటీసీ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించడానికి అంతా కలిసి మొక్కలు పెంచి భూతాపాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం సర్వశిక్ష అడిషన్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల వాడడంతో ప్రకృతి విపత్తులు పెరుగుతాయని, ఉష్ణోగ్రతలు ఎక్కువ అవుతాయని తెలియజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జోగేంద్రనాథ్‌తో కలిసి అతిథులు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల పేర్ల నమోదుతో మెరుగైన సేవలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జగదీశ్వరరావు



తాళ్లవలస పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు

తగరపువలస: గర్భిణుల పేర్లు మూడు నెలల్లోగా నమోదు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు ఆదేశించారు. ఆనందపురం పీహెచ్‌సీలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల పేర్లు త్వరగా నమోదు చేయడం వల్ల వారికి అవసరమైన సేవలు అందించడానికి వీలవుతుందన్నారు. వారికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించిన కేంద్రాల్లో స్కానింగ్ చేయించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తల్లీబిడ్డ వాహన సేవలను వినియోగించుకోవాలన్నారు. ఆశ కార్యకర్తలు 'ఆశ' యాప్‌ను రోజూ ఉపయోగించుకోవాలని ఆదేశించారు. కిల్కారి మొబైల్ యాప్ సేవలను గర్భిణులకు ఉపయోగపడేలా, అక్కడి నుంచి వచ్చే ఫోన్ కాల్స్ వినేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. డయేరియా ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమావతి, ఎన్‌హెచ్‌ఎం పరిపాలన అధికారి రమేష్, పీహెచ్‌సీ వైద్యాధికారులు గంగునాయుడు, షెహనాజ్ సాధియా, జిల్లా కేంద్రం ఆరోగ్య విస్తరణ అధికారి నాగభూషణం, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్ష

భీమిలి మండలం తాళ్లవలస, ఆనందపురం పీహెచ్‌సీలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జగదీశ్వరరావు బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్ష నిర్వహించారు. అర్హులందరూ వ్యాక్సిన్ వేసుకునేలా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు, జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి సూచనలు చేశారు. రికార్డులతో పాటు ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నేడు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీత తదితరులు

సీతంపేట : అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.సునీత చేతుల మీదుగా మంగళవారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో కలిసి ఈ నెల మొత్తం చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 12న ముఖ్య విభాగాల అధికారులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్రవంతి డైరెక్టర్ ఎం.మాలిని, విశాఖ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ప్రతినిధి హరి, ఆదర్శ ఇంటి పనివారల సంఘం ప్రతినిధులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్లు ఎ.రాజు, ఆర్.రమాదేవి, ఎస్.మోహనలక్ష్మి, ఏసీఎల్‌లు మనోజ్, నరేష్, పద్మావతి పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు నంది కన్ని

సీతమ్మధార : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తాటిచెట్లపాలెం వాటర్ ట్యాంక్ సమీపం లోని ప్రశాంతినగర్‌లో కలకత్తాకు చెందిన నంది కన్ని (37) నివాసం ఉంటున్నాడు. అతను కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. 2017లో జీవనోపాధి కోసం విశాఖ వచ్చి అన్నావదినలతో ఉంటున్నాడు. గత నెలలో తల్లి చనిపోవడంతో పాటు తనకు పెళ్లి కాలేదని మనస్తాపంతో మంగళవారం ఉదయం మేడపై ఉన్న మెట్లకు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై కుటుంబ సభ్యులు ఫోర్తుటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణపుష్పాలతో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు



రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబ అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. మజ్జివలస కళ్లాలకు చెందిన సరగడ వెంకటరమణ, నాగమణి దంపతుల సహకారంతో అమ్మవారిని మల్లె, ఎరుపు, పసుపు గులాబీలు, డిశంబరు, లిల్లీ పువ్వులు, తులసి మాలలతో అలంకరించారు. తుపాకుల అప్పల రాసయ్య, రసమ్మ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

న్యాయ సేవాధికార సంస్థతో సత్వర న్యాయం



సదస్సులో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ



హాజరైన గొరపల్లి గ్రామస్తులు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

పెందుర్తి: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మండలంలోని గొరపల్లిలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు న్యాయ సహాయం అవసరం అయితే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని వ్యాజ్యాలు లేని గ్రామాలుగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.ఎస్ రంగలక్ష్మి, ఆర్‌ఐ సాయికిరణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజు, సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. చల్లగ చూడమ్మా



దుర్గమాంబను దర్శించుకొంటున్న భక్తులు



ఆకట్టుకొన్న డ్యాన్స్ బేబీ డ్యాన్స్

సబ్బవరం: సబ్బవరం ప్రజల ఆరాధ్య దేవత,కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి దుర్గమాంబ అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు.వేకువజాము నుంచి సబ్బవరంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించికొని ప్రత్యేక పూజలు చేశారు.మహిళలు పసుపు కుంకుమలు,చీరలు అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం నుండి కోలాటం,బాణసంచా కాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. సాయంత్రం నుంచి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా ముత్యాలమ్మ పండగ



ముత్యాలమ్మ



అన్నసమారాధన వడ్డన చేస్తున్న గంట్ల శ్రీనుబాబు

సింహాచలం: అడవివరం గ్రామ దేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి ముత్యాలమ్మ పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. విజినిగిరిపాలెం, లండగరువు ప్రాంతాల మధ్య వ్యవసాయ పొలాల్లో ఉన్న ముత్యాలమ్మ ఆలయానికి ఉదయం నుంచి పెద్ద ఎత్తున గ్రామస్తులు చేరి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపుకుంకుమలు, చీరలు సమర్పించి మొక్కుతీర్చుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. పాత అడవివరంలోని బంగారమ్మ శతకంపట్టు నుంచి పూజారి వంశీయులైన లండ వంశస్తులు ఘటాలతో తోటవీధి, కాపువీధి, రామాలయం వీధి, వరాహ పుష్కరిణి మీదుగా విజినిగిరిపాలెం పొలాల్లో ఉన్న ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా గ్రామస్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించారు. ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. 98వవార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజారి వంశీయులు లండ శ్రీను, లండ రమణ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కూలిన చెట్టు తొలగించరూ!



సినిమాహాలు కూడలి-పరవాడ గ్రామాల మధ్య కూలిన చెట్టు

పరవాడ: గత నెల 31న రాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి పలు చోట్ల కూలిన చెట్లను తొలగించడంలో రోడ్లు భవనాల శాఖ చర్యలు చేపట్టని కారణంగా గ్రామీణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఊటగెడ్డ కూడలి, గొర్లివానిపాలెం, పరవాడ గ్రామాలకు రాకపోకలు సాగించే రహదారులపై కూలిన చెట్లను ఇప్పటి వరకు తొలగించలేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. సినిమాహాలు కూడలి-పరవాడ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ రోడ్డుపై కూలిన చెట్టు వాహనాల రాకపోకలకు పెద్ద అడ్డంకిగా మారింది. చెట్టు కూలిపోయి 12 రోజులు కావస్తున్నా ఆర్ అండ్‌బీ అధికారులు మాత్రం ఇప్పటి వరకు వాటి వంక చూడకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికులకు అవరోధంగా మారిన చెట్టును తొలగించడానికి చర్యలు చేపట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కల్యాణం.. కమనీయం



యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.